క్లుప్తంగా

ఆరోగ్యంపై జాగ్రత్త అవసరం

మున్సిపల్ కమిషనర్ వాణి



పారిశుద్ధ్య కార్మికులకు పరీక్షలు చేస్తున్న వైద్యులు

తుక్కుగూడ: ప్రతిఒక్కరూ ఆరోగ్యంపై జాగ్రత్త వహించాలని మున్సిపల్ కమిషనర్ ఏ.వాణి పేర్కొన్నారు. ముఖ్యంగా మున్సిపాలిటీలో పని చేస్తున్న పారిశుద్ధ్య కార్మికులు ఆరోగ్యంపై శ్రద్ధ తీసుకోవాలని సూచించారు. ఆదివారం మున్సిపల్ కార్యాలయంలో మహిళా కార్మికులకు ఉచిత వైద్య పరీక్షలు నిర్వహించారు. ఈ సందర్భంగా వాణి మాట్లాడారు. కార్మికుల ఆరోగ్య సంరక్షణ కోసం ఆదివారం వైద్య పరీక్షలు చేయించామన్నారు. ఈ కార్యక్రమంలో మేనేజర్ పర్వతాలు, సీనియర్ అసిస్టెంట్ మల్లేశ్, జంగయ్య, సిబ్బంది అశోక్, దేవేందర్, నాగేశ్, వైద్యులు స్వరూప, వెంకటరాఘవా, తదితరులు పాల్గొన్నారు.

వైభవంగా పల్లకీసేవ

తుక్కుగూడ: మున్సిపాలిటీ పరిధిలోని జిన్నాయిగూడ ఛత్రగిరి లక్ష్మీనర్సింహస్వామి ఆలయంలో ఆదివారం కార్తీకమాసం అమావాస్య సందర్భంగా వైభవంగా పల్లకీసేవ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా స్వామివారికి ప్రత్యేకలంకరణ చేసి ఆలయ వీధుల్లో ఊరేగించారు. అనంతరం భజన కార్యక్రమం, భక్తులకు అన్నదానం చేశారు. కార్యక్రమంలో అర్చకులు అజయ్‌శర్మ, మురళీశర్మ, భక్తులు తదితరులు పాల్గొన్నారు.

మున్సిపల్ కార్యాలయానికి అలంకరణ



విద్యుద్దీపాలతో కళకళలాడుతున్న మున్సిపల్ కార్యాలయం

తుక్కుగూడ: రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వం ఏర్పాటై సంవత్సర కాలం పూర్తి చేసుకున్న సందర్భంగా విజయోత్సవాల్లో భాగంగా అధికారులు మున్సిపల్ కార్యాలయం, బస్టాండ్‌లోని మహాత్ముల విగ్రహాలను ముస్తాబు చేశారు. విద్యుద్దీపాల వెలుగులతో కార్యాలయం కళకళలాడుతోంది.

ఉచిత వైద్య పరీక్షలను సద్వినియోగం చేసుకోవాలి



పరీక్షలు నిర్వహిస్తున్న వైద్యులు

తుక్కుగూడ: తుక్కుగూడ కొండేటి సూపర్ స్పెషాలిటీ ఆస్పత్రి అందించే ఉచిత వైద్య పరీక్షలను పరిసర ప్రాంత ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని మేనేజింగ్ డైరెక్టర్ కొండేటి మల్లయ్య పేర్కొన్నారు. ఆదివారం కొంగరకలాన్ గ్రామంలో ఉచిత వైద్య శిబిరం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. తమ ఆస్పత్రిలో ప్రతి శుక్రవారం గైనకాలజీ సంతానలేమి వారికి, ప్రతి సోమవారం బీపీ, షుగర్, థైరాయిడ్ వ్యాధులకు ఉచితంగా ఓపీ సౌకర్యం కల్పిస్తున్నామన్నారు. వైద్య పరీక్షలకు 20శాతం డిస్కౌంట్ ఇవ్వనున్నట్లు తెలిపారు. ఈ సౌకర్యాన్ని కొంగర ప్రజలు సద్వినియోగించుకోవాలని ఆయన కోరారు. ఈ కార్యక్రమంలో ఆదిబట్ల సీఐ రాఘవేందర్‌రెడ్డి, డాక్టర్లు కే. సౌమ్యశ్రీ, ప్రమోద్ కుమార్, కౌన్సిలర్లు మహేందర్, వనం శ్రీనివాస్, దాస్‌గౌడ్, తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థులకు వ్యాసరచన పోటీలు



విద్యార్థులకు బహుమతులు అందజేస్తున్న ఎంఈఓ కృష్ణయ్య, తదితరులు

మీర్‌పేట: ప్రజాపాలన విజయోత్సవాల్లో భాగంగా మీర్‌పేట కార్పొరేషన్ పరిధి జిల్లెలగూడలోని చల్లా లింగారెడ్డి ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో విద్యార్థులకు వ్యాసరచన పోటీలు నిర్వహించారు. ఈ సందర్భంగా మండల విద్యాధికారి కృష్ణయ్య మాట్లాడుతూ.. 6 నుంచి 10వ తరగతి విద్యార్థులకు 'పునరుత్పాదక శక్తి' అనే అంశంపై వ్యాసరచన పోటీలు నిర్వహించి, అనంతరం ప్రతిభ కనబరిచిన వారికి మొదటి, ద్వితీయ, తృతీయ బహుమతులను అందజేశామని తెలిపారు. అదేవిధంగా పోటీల్లో పాల్గొన్న విద్యార్థులకు మధ్యాహ్న భోజనం అందించామని చెప్పారు. కార్యక్రమంలో కార్పొరేటర్లు అర్కల భూపాల్‌రెడ్డి, రాంచందర్, ఉపాధ్యాయులు సరళ, శ్రీనివాస్‌రెడ్డి, హనుమంతరెడ్డి, శిరీష పాల్గొన్నారు.

పశువైద్యం అందని దైన్యం

- సిబ్బంది కొరతతో మూతబడ్డ ఉపకేంద్రాలు
- ప్రైవేట్ వైద్యులను ఆశ్రయిస్తున్న పశు పోషకులు
- ఆర్థికంగా ఇబ్బంది పడుతున్న పాడిరైతులు
- పట్టించుకోని అధికారులు



వెంకటాపూర్‌లో మూతపడ్డ పశువైద్య ఉపకేంద్రం

మొయినాబాద్: మండలంలో మూగజీవాలకు పశువైద్యం అందని ద్రాక్షలా తయారైంది. పశువైద్యశాలల్లో సిబ్బంది కొరతతోపాటు సరిపడా వసతులు లేక పశువులకు సరైన వైద్యం అందడంలేదు. వైద్యశాలల్లో కొంతకాలంగా పోస్టులు భర్తీకి నోచుకోకపోవడంతో పలు ఉపకేంద్రాలు మూతబడ్డాయి. దీంతో గ్రామాల్లో పశువులకు సరైన వైద్యం అందక రైతులు ఇబ్బందులు పడుతున్నారు. ఇప్పటికైనా రాష్ట్ర ప్రభుత్వం స్పందించి పశువైద్యశాలల్లో ఉన్న ఖాళీ పోస్టులను భర్తీ చేయాలని పాడి రైతులు, గొల్లకురుమలు కోరుతున్నారు.

మండలంలో సిబ్బంది ఇలా..

మండలంలో మూడు పశువైద్య కేంద్రాలు, ఐదు పశువైద్య ఉపకేంద్రాలు ఉన్నాయి. మొయినాబాద్, అమ్డాపూర్, కనకమామిడి గ్రామాల్లో పశువైద్య కేంద్రాలు ఉండగా వీటిలో డాక్టర్లు ఉన్నారు. కనకమామిడి పశువైద్య కేంద్రంలో పశువైద్య సిబ్బంది, అటెండర్ పోస్టులు ఖాళీగా ఉన్నాయి. ఉన్న డాక్టర్ కూడా సమయానికి అందుబాటులో ఉండరనే ఆరోపణలు వస్తున్నాయి. అమ్డాపూర్ పశువైద్య కేంద్రంలో అటెండర్ పోస్టు ఖాళీగా ఉంది. మరోవైపు మండలంలోని అజీజ్‌నగర్, చిలుకూరు, పెద్దమంగళారం, కేతిరెడ్డిపల్లి, వెంకటాపూర్ గ్రామాల్లో పశువైద్య ఉపకేంద్రాలు ఉన్నాయి. వీటిలో చిలుకూరు, కేతిరెడ్డిపల్లి, వెంకటాపూర్ పశువైద్య ఉపకేంద్రాల్లో పశువైద్య సిబ్బంది అసలే లేరు.

ఐదేళ్లగా మూతపడ్డ ఉపకేంద్రాలు

మండలంలోని వెంకటాపూర్, కేతిరెడ్డిపల్లి గ్రామాల్లోని పశువైద్య ఉపకేంద్రాలు గత ఐదేళ్లుగా మూతపడ్డాయి. ఐదేళ్ల నుంచి ఇక్కడ పశువైద్య సిబ్బంది ఎవరూ అందుబాటులో లేరు. అదేవిధంగా చిలుకూరు పశువైద్య ఉపకేంద్రం మూడేళ్లుగా మూతపడింది. పశువైద్య సిబ్బంది లేకపోవడంతో మూడు గ్రామాల్లో పశువైద్య ఉపకేంద్రాలు తెరుచుకోవడంలేదు. దీంతో ఆయా ఉపకేంద్రాల పరిధిలోని రైతులు, గొర్రెలు, మేకల పెంపకందారులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. పశువులు, జీవాలు అనారోగ్యానికి గురైతే మొయినాబాద్ మండల కేంద్రంలోని పశువైద్య కేంద్రానికే వెళ్లాల్సిన పరిస్థితి నెలకొంది.

ప్రైవేటుపై ఆధారపడుతున్న రైతులు

మండలంలో ఆవులు, గేదెలు, గొర్రెలు, మేకలు అధికంగా ఉన్నాయి. వాటితో పాటు మండలంలోని చాలా ఫాంహౌస్‌లలో కుక్కలు, కోళ్లు, మేకలు, గుర్రాలు పెంచుతున్నారు. గ్రామాల్లోని పశువులతో పాటు ఫాంహౌస్‌లలోని పశువులకు పశువైద్యం అందించడానికి సరైన సిబ్బంది లేకపోవడంతో చాలా మంది ప్రైవేటు పశువైద్యులపై ఆధారపడుతున్నారు. ప్రైవేటు పశువైద్యులు, సిబ్బందిని తమ పశువుల వద్దకే రప్పించుకుని వైద్యం చేయిస్తున్నారు. దీంతో రైతులపై ఆర్థిక భారం అధికంగా పడుతోంది.

పశువైద్యులు అందుబాటులో లేరు

ఏడేళ్ల క్రితం పది గేదెలతో డైరీ ఏర్పాటు చేశాను. గేదెలకు ఎలాంటి వైద్యం అందించాలన్నా ప్రైవేట్ పశువైద్యులనే సంప్రదించాల్సి వస్తోంది. వెంకటాపూర్‌లో పశువైద్య ఉపకేంద్రం ఉన్నా సిబ్బంది ఎవరూ లేక మూతపడింది. ప్రైవేట్ పశువైద్యులతో వైద్యం చేయిస్తే ఒక్కోసారి రూ.5వేల నుంచి 6వేల వరకు ఖర్చు అవుతోంది. ప్రభుత్వం స్పందించి పశువైద్యులను అందుబాటులో ఉంచితే మాకు ఆర్థిక భారం తగ్గుతుంది.

– భిక్షపతి, పాడిరైతు, శ్రీరాంనగర్

ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్లాం

మండలంలో మూడు పశువైద్య కేంద్రాలు, ఐదు పశువైద్య ఉపకేంద్రాలు ఉన్నాయి. వెంకటాపూర్, కేతిరెడ్డిపల్లి, చిలుకూరు ఉపకేంద్రాల్లో సిబ్బంది లేకపోవడంతో మూతపడ్డాయి. ఈ విషయాన్ని ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్లాం. సిబ్బంది వస్తే ఉపకేంద్రాలు తెరిచే అవకాశం ఉంటుంది. ప్రస్తుతం ఉన్న సిబ్బందితోనే అన్ని గ్రామాల్లో పశువులకు వైద్య సేవలు అందిస్తున్నాం.

– అహ్మద్, మండల పశువైద్యాధికారి

కిష్టయ్య ముదిరాజ్ చిత్రపటానికి నివాళి

మహేశ్వరం: తెలంగాణ మలిదశ ఉద్యమ అమరుడు కానిస్టేబుల్ కిష్టయ్య ముదిరాజ్ వర్ధంతి సందర్భంగా కందుకూరు మండల కేంద్రంలో మండల ముదిరాజ్ మహాసభ ఆధ్వర్యంలో ఆదివారం ఆయన చిత్రపటానికి పూలమాల వేసి ఘనంగా నివాళులర్పించారు. మలిదశ ఉద్యమంలో తొలి అమరుడైన కిష్టయ్య ముదిరాజ్ చేసిన బలిదానంతో తెలంగాణ కల సాకారమైందన్నారు. ఆయన చేసిన త్యాగాన్ని తెలంగాణ ఎప్పటికీ మరువదన్నారు. ఈ కార్యక్రమంలో మండల ముదిరాజ్ మహాసభ అధ్యక్షుడు పిట్టల పాండు ముదిరాజ్, ప్రధాన కార్యదర్శి కొర్వి సురేందర్ ముదిరాజ్, ఉపాధ్యక్షుడు నల్లి సుదర్శన్, పెద్ద బాల్‌రాజ్, గౌరవ అధ్యక్షుడు కాకి రాములు హరికిషన్, నాయకులు ప్రవీణ్, నరేందర్, లింగం, దేవేందర్, శ్రీధర్, బాబు, ఆంజనేయులు, వినోద్ తదితరులు పాల్గొన్నారు.



కిష్టయ్య చిత్రపటానికి నివాళులర్పిస్తున్న ముదిరాజ్ సంఘం నాయకులు



మాట్లాడుతున్న చైర్‌పర్సన్ హేమలత, కమిషనర్ వాణి

మున్సిపాలిటీని ఆదర్శంగా తీర్చిదిద్దాలి

మున్సిపల్ చైర్‌పర్సన్ బరిగెల హేమలత

తుక్కుగూడ: స్వచ్ఛతలో మున్సిపాలిటీని జిల్లాలోనే ఆదర్శంగా తీర్చిదిద్దాలని మున్సిపల్ చైర్‌పర్సన్ బరిగెల హేమలతరాజుగౌడ్ అన్నారు. ఆదివారం మున్సిపాలిటీలో ప్రజాపాలన విజయోత్సవాల్లో భాగంగా కమిషనర్ ఏ.వాణితో కలిసి పారిశుద్ధ్య కార్యక్రమాలను ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. ప్రతి ఒక్కరూ పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలన్నారు. తడి, పొడి చెత్తను వేరుచేసి ఆరుబయట వేయకుండా మున్సిపల్ చెత్త వాహనాలకు అప్పగించాలని సూచించారు. ఈ కార్యక్రమం ఈ నెల 9వ తేదీవరకు కొనసాగుతుందన్నారు. కార్యక్రమంలో మేనేజర్ పర్వతాలు, కౌన్సిలర్లు బాదావత్ రవినాయక్, శివకుమార్, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

మాలల సింహగర్జన ర్యాలీ



యాచారంలో సింహగర్జన ర్యాలీ నిర్వహిస్తున్న మాలలు



ఆమనగల్లు: సికింద్రాబాద్‌కు తరలిన మాల మహానాడు నాయకులు



తలకొండపల్లి నుంచి వెళ్తున్న మాల నాయకులు

ఆమనగల్లు: సికింద్రాబాద్ పరేడ్ గ్రౌండ్స్‌లో మాల మహానాడు ఆధ్వర్యంలో ఎస్సీస్సీ వర్గీకరణకు వ్యతిరేకంగా నిర్వహిస్తున్న మాలల సింహగర్జనకు ఆమనగల్లు మండలం నుంచి మాల మహానాడు నాయకులు పెద్ద ఎత్తున తరలివెళ్లారు. స్థానిక పట్టణంలోని చెన్నకేశవస్వామి దేవాలయం నుంచి అంబేడ్కర్ విగ్రహం వరకు భారీ ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా పలువురు మాల మహానాడు నాయకులు మాట్లాడారు. కాలె మల్లయ్య, లండం చంద్రయ్య, నర్సింహ, దేవేందర్, రమేశ్, జగన్, రాజు, చెన్నకేశవులు, వెంకటేశ్, యాదయ్య తదితరులు పాల్గొన్నారు.

యాచారంలో..

యాచారం: నగరంలో నిర్వహించిన మాలల సింహగర్జన సభకు మండల పరిధిలోని పలు గ్రామాల నుంచి మాలలు పెద్ద సంఖ్యలో తరలివెళ్లారు. మండల కేంద్రంలోని అంబేడ్కర్ విగ్రహానికి పూలమాలవేసి ర్యాలీ నిర్వహించారు. అనంతరం సింహగర్జన సభకు తరలివెళ్లారు. ఈ కార్యక్రమంలో పెంటయ్య, శేఖర్, యాదయ్య తదితరులు పాల్గొన్నారు.

తలకొండపల్లిలో..

తలకొండపల్లి: మండల కేంద్రంతో పాటు, చుక్కాపూర్, యడవల్లి, చీపునుంతల, చంద్రధన, రాంపూర్, తదితర గ్రామాల నుంచి మాల నాయకులు, కార్యకర్తలు, అధిక సంఖ్యలో తరలివెళ్లారు. దాసరి యాదయ్య, కనక వెంకటయ్య, కంఠం శేఖరు, నరసింహ, సత్యం, గిరి, మహిళలు, తదితరులు పాల్గొన్నారు.

స్థానికత ఆధారంగా బదిలీలు చేపట్టాలి



ఆమనగల్లులో నిరసన వ్యక్తం చేస్తున్న ఉపాధ్యాయులు

ఆమనగల్లు: స్థానికత ఆధారంగా ఉపాధ్యాయుల బదిలీలు చేపట్టాలని ఉమ్మడి మహబూబ్‌నగర్ జిల్లా జేఏసీ అధ్యక్షుడు మల్లేశ్ డిమాండ్ చేశారు. ఆమనగల్లు పట్టణంలోని ఎంపీడీఓ కార్యాలయ ఆవరణలో భారత రాజ్యాంగ నిర్మాత డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ విగ్రహం వద్ద రాష్ట్ర జేఏసీ పిలుపు మేరకు జీఓ నంబర్ 317 బాధిత ఉపాధ్యాయులు నిరసన చేపట్టారు. ఈ సందర్భంగా జేఏసీ అధ్యక్షుడు మల్లేశ్ మాట్లాడారు. కాంగ్రెస్ అధికారంలోకి వచ్చిన వెంటనే జీఓ నంబర్ 317 స్థానికత సమస్యను పరిష్కరిస్తామని హామీ ఇచ్చి, నేడు సమస్యను పట్టించుకోకపోవడం బాధాకరమన్నారు. స్థానికత కోల్పోయిన వారికి న్యాయం చేయడానికి ఏర్పాటు చేసిన సబ్‌కమిటీ నివేదికలో స్థానికత అంశం లేకపోవడం, సబ్‌కమిటీ సిఫారసుల ఆధారంగా కమిటీకి సంబంధం లేని స్పౌజ్, మ్యుచువల్, మెడికల్‌కు సంబంధించిన జీఓలు విడుదల చేయడం ఎంతవరకు సమంజసమని ఆయన ప్రశ్నించారు. ఈ సమస్యను వెంటనే పరిష్కరించాలని ఆయన కోరారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయులు శ్రీనివాస్, అలివేలు, కల్పన, శ్రీను, చంద్రశేఖర్, నర్సింహ, పత్య, రాములు, రవి తదితరులు పాల్గొన్నారు.

విపక్షాలకు అభివృద్ధిపై అవగాహన లేదు

మాజీ ఎమ్మెల్యే కేఎల్లార్

తుక్కుగూడ: నియోజకవర్గంలో ప్రభుత్వం ఏర్పాటు చేసే ఫోర్త్‌సిటీపై విపక్షాలకు అవగాహన లేదని మాజీ ఎమ్మెల్యే, కాంగ్రెస్ పార్టీ మహేశ్వరం నియోజకవర్గ ఇన్‌చార్జి కేఎల్లార్ అన్నారు. ఆదివారం మున్సిపాలిటీలోని పార్టీ కార్యాలయంలో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడారు. ఫోర్త్‌సిటీకి వచ్చే 300 ఫీట్ల రోడ్డుతో సమీప రైతుల భూములకు ఊహించని విధంగా రేట్లు పెరుగుతాయన్నారు. దీంతో ఈ ప్రాంతం అభివృద్ధి చెందుతుందన్నారు. ఫోర్త్‌సిటీ అభివృద్ధిపై బీఆర్ఎస్, బీజేపీ నాయకులు లేనిపోని ఆరోపణలు చేయడం తగదన్నారు. రైతులు విపక్ష నాయకుల మాటలు నమ్మొద్దన్నారు. రోడ్డు ఏర్పాటు సందర్భంగా భూములు కోల్పోయిన రైతులకు ప్రభుత్వం న్యాయం చేస్తుందన్నారు.

కరాటేలో విద్యార్థుల ప్రతిభ



గెలుపొందిన విద్యార్థులతో ఎమ్మెల్యే సబితారెడ్డి

మీర్‌పేట: సాగర్‌రింగు రోడ్డులోని కేకే గార్డెన్స్‌లో ఆదివారం నిర్వహించిన రాష్ట్రస్థాయి కరాటే ఛాంపియన్‌షిప్ పోటీల్లో మీర్‌పేటకు చెందిన విద్యార్థులు సత్తాచాటారు. షారిక్, జశ్వంత్, హేమంత్‌లు గోల్డ్‌మెడల్ సాధించగా, హరివర్ధన్ కాంస్య, శ్రీనిధి రజత పతకాలు సాధించినట్లు శిక్షకుడు జి.అరుణ్‌కుమార్ తెలిపారు. అనంతరం కార్యక్రమానికి మహేశ్వరం ఎమ్మెల్యే సబితా ఇంద్రారెడ్డి ముఖ్య అతిథిగా హాజరై గెలుపొందిన విద్యార్థులకు మెడల్స్, సర్టిఫికెట్లు అందజేశారు.

రాచులూర్‌లో అయ్యప్ప మహాపడి పూజ

మహేశ్వరం: కందుకూరు మండల పరిదిలోని రాచులూర్ గ్రామంలో గురుస్వామి బేతు రాఘవేందర్‌రెడ్డి 18వ మెట్టు మహాపడి పూజ కార్యక్రమం గురుస్వామి కుట్టన్ చంద్ర మోహన్ నాయర్ ఆధ్వర్యంలో ఆదివారం వైభవంగా నిర్వహించారు. పూజలో భక్తులు అభిషేకం, హారతి, పంచామృత అభిషేకాలతో పాటు పలు పూజలు నిర్వహించారు. ఈ పూజ కార్యక్రమానికి మహేశ్వరం ఎమ్మెల్యే సబితారెడ్డి హాజరై పూజలు చేసి తీర్థ ప్రసాదాలు స్వీకరించారు. కార్యక్రమంలో అర్జున అవార్డు గ్రహీత వెదిరె రవికాంత్‌రెడ్డి, పీఏసీఎస్ చైర్మన్ చంద్రశేఖర్, అయ్యప్ప భక్తులు పాల్గొన్నారు.

సీపీఎం మండల కార్యదర్శిగా రావుల జంగయ్య

మంచాల: సీపీఎం మండల కార్యదర్శిగా చిత్తాపూర్ గ్రామానికి చెందిన రావుల జంగయ్యను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. ఆదివారం మంచాల మండలంలోని లోయపల్లి గ్రామంలో నిర్వహించిన సీపీఎం మండల మహాసభల సందర్భంగా నూతన కార్యదర్శిగా ఆయనను పార్టీ నాయకులు నియమించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. పార్టీ తనపై నమ్మకంతో అప్పగించిన బాధ్యతను నేరవేర్చుతానని తెలిపారు. రాష్ట్ర, జిల్లా పార్టీ బాధ్యులకు ఈ సందర్భంగా ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు.

రోడ్డుకు మరమ్మతులు చేయించాలి



ఎమ్మెల్యే సబితారెడ్డితో బీఆర్ఎస్ నాయకులు

ఎమ్మెల్యే సబితారెడ్డికి బీఆర్ఎస్ నాయకుల వినతి

మహేశ్వరం: నాగారం–పెద్ద గోల్కొండ ఔటర్‌రింగ్ రోడ్డు వరకు గుంతలమయంగా మారిన బీటీరోడ్డుకు మరమ్మతులు చేయించాలని మండల బీఆర్ఎస్ నాయకులు ఎమ్మెల్యే సబితారెడ్డిని ఆదివారం ఆమె నివాసంలో కలిసి విన్నవించారు. మండల పరిధిలోని నాగారం నుంచి పెద్ద గోల్కొండ ఔటర్ వరకు గల బీటీరోడ్డుకు గుంతలు ఏర్పడడంతో నిత్యం వాహనదారులు రాకపోకలకు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని, గుంతల రోడ్డుకు మరమ్మతులు చేయించాలని ఎమ్మెల్యేను కోరారు. అదేవిధంగా రోడ్డు వెడల్పు నిర్మాణ పనులు త్వరితగతిన చేపట్టి వాడుకలోకి తీసుకురావాలని ఆమెను కోరారు. ఈ విషయంపై ఎమ్మెల్యే రోడ్డుకు సంబంధించిన అధికారులతో ఆమె మాట్లాడి ప్యాచ్ వర్క్‌లు వెంటనే చేపట్టాలని ఆదేశించారు. వీలైనంత త్వరగా రోడ్డు వెడల్పు పనులు చేపట్టాలన్నారు. గుంతలుగా ఏర్పడిన రోడ్డుకు మరమ్మతులు చేపడుతామని ఆర్‌అండ్‌బీ డీఈ అధికారి పేర్కొన్నారు. ఎమ్మెల్యేను కలిసిన వారిలో పీఏపీఎస్ వైస్ చైర్మన్ దేవరంపల్లి వెంకటేశ్వరరెడ్డి, బీఆర్ఎస్ సీనియర్ నాయకులు, మాజీ సర్పంచ్ గాదె థామస్‌రెడ్డి, బండారి లింగం ముదిరాజ్, రాజేశ్, ఎంఏ.సమీర్, శ్రీకాంత్‌గౌడ్ తదితరులు పాల్గొన్నారు.

'స్ఫూర్తి'లో ఎన్‌సీసీ డే

బడంగ్‌పేట్: కార్పొరేషన్ పరిధిలోని స్ఫూర్తి ఇంజనీరింగ్ కాలేజీలో ఎన్‌సీసీ దినోత్సవ సంబురాలను పురస్కరించుకుని ఎన్‌సీసీ విద్యార్థులు పలు అంశాల్లో విన్యాసాలు నిర్వహించి అబ్బురపరిచారు. మానవ జీవన విధానంలో క్రమశిక్షణ గురించి ఎన్‌సీసీ క్యాడెట్లు కళ్లకు కట్టినట్లు వివరించారు. నేటి విద్యార్థులే రేపటి పౌరులని క్యాడెట్లు దేశం కోసం ఎప్పుడు సంసిద్ధంగా ఉండాలన్నారు. అనంతరం భారత రాజ్యాంగ దినోత్సవాన్ని ఘనంగా జరుపుకున్నారు. ప్రపంచంలో అతిపెద్ద రాజ్యాంగ వ్యవస్థ కలిగిన భారతదేశం ప్రపంచ దేశాలకు ఆదర్శమని గుర్తుచేశారు. భారత రాజ్యాంగానికి కట్టుబడి ఉండాలని, అది మన విధి అని కళాశాల సెక్రెటరి జగన్మోహన్‌రెడ్డి పేర్కొన్నారు. దేశ రక్షణకు తోడ్పాడు అందిస్తున్న ఎన్‌సీసీ క్యాడెట్లకు అభినందనలు తెలిపారు. ఈ కార్యక్రమంలో కాలేజీ ప్రిన్సిపల్ డాక్టర్ ఆకుల గిరిధర్, ఇంజనీరింగ్ డిపార్ట్‌మెంట్ అధిపతి డాక్టర్ పి గాయత్రిపావని, అరాఫత్, అధ్యాపకులు, సిబ్బంది పాల్గొన్నారు.



ఎన్‌సీసీ క్యాడెట్లతో యాజమాన్యం

నాణ్యమైన విద్యా బోధనలో రాజీ వద్దు

పీఆర్టీయూటీఎస్ మాజీ ప్రధాన కార్యదర్శి గుర్రం చెన్నకేశవరెడ్డి

యాచారం: ప్రభుత్వ పాఠశాలల్లో చదువుతున్న పేద విద్యార్థులకు నాణ్యమైన బోధన చేపట్టే విషయంలో రాజీ పడొద్దని పీఆర్టీయూటీఎస్ మాజీ ప్రధాన కార్యదర్శి గుర్రం చెన్నకేశవరెడ్డి సూచించారు. యాచారం మండల కేంద్రంలో ఆదివారం జిల్లాలోని డీఎస్సీ–2024 ఉపాధ్యాయుల ఆత్మీయ సమ్మేళనం నిర్వహించారు. జ్యోతి ప్రజ్వలన అనంతరం బీఎస్ఆర్ ట్రస్ట్ చైర్మన్ బిలకంటి చంద్రశేఖర్‌రెడ్డి ఆర్థిక సహకారంతో 345 మంది నూతన ఉపాధ్యాయులకు సర్వీస్ బుక్కులను అందజేశారు. ఈ సందర్భంగా గుర్రం చెన్నకేశవరెడ్డి మాట్లాడారు. ప్రభుత్వ పాఠశాలల్లోని విద్యార్థుల ఉత్తీర్ణతపైనే ఉపాధ్యాయులకు గుర్తింపు లభిస్తుందన్నారు. దీంతో తల్లిదండ్రులకు ప్రభుత్వ పాఠశాలలపై మంచి అభిప్రాయం నెలకొంటుందన్నారు. ఉపాధ్యాయుల సమస్యలపై నాటి నుంచి నేటి వరకు రాజీలేని పోరాటం చేస్తూ పీఆర్టీయూటీఎస్‌కు మంచి గుర్తింపు ఉందన్నారు. అనంతరం బీఎస్ఆర్ ట్రస్ట్ చైర్మన్ బిలకంటి చంద్రశేఖర్‌రెడ్డి మాట్లాడారు. ఉపాధ్యాయుల సమస్యల పరిష్కారానికి, ఆర్థిక సహకారం అందించే విషయంలో సంతోషంగా ఉందన్నారు. ఉపాధ్యాయ వృత్తి దేవుడిచ్చిన వరమన్నారు. చక్కగా సద్వినియోగం చేసుకుంటు నేటి బాలలను రేపటి పౌరులుగా తీర్చిదిద్దాలన్నారు. పీఆర్టీయూటీఎస్ జిల్లా అధ్యక్షుడు సామల మహేందర్‌రెడ్డి అధ్యక్షతన జరిగిన సమావేశంలో రాష్ట్ర ప్రధాన కార్యదర్శి పులగం దామోదర్‌రెడ్డి, మాజీ ఎమ్మెల్సీ మోహన్‌రెడ్డి, మాజీ రాష్ట్ర అధ్యక్షుడు పెరి వెంకట్‌రెడ్డి, జిల్లా గౌరవాధ్యక్షుడు రాఘవేందర్, ప్రధాన కార్యదర్శి కృష్ణారెడ్డి, యాచారం మండల అధ్యక్ష, కార్యదర్శులు తిరుమలేష్, యాదగిరి, రాష్ట్ర అసోసియేట్ అధ్యక్షుడు అందెం ప్రతాప్‌రెడ్డి, మాజీ జిల్లా అధ్యక్షుడు జగన్మోహన్‌గుప్తా తదితరులు పాల్గొన్నారు.



ఉపాధ్యాయుల ఆత్మీయ సమ్మేళనంలో జ్యోతి ప్రజ్వలన చేస్తున్న చెన్నకేశవరెడ్డి తదితరులు